బాలమిత్ర , ఏప్రిల్ - 1992, పుట : 42-44, జి. రామలక్ష్మి - హైదరాబాదు

## కనువిప్పు

ఊరి చివర స్వాములవారు వచ్చి ఉన్నారని, విభూతి, రక్షరేకులు యిచ్చి రోగాలు నయం చేస్తున్నారని - ఎన్నెన్నో మహిమలు చేసి చూపిస్తున్నారని, ఆయన వెంట నలుగురు శిష్యులు కూడా వచ్చారని, బలే మహిమగల దేవుడికి ప్రతిరూపమైన స్వాములవారని ఊరు ఊరంతా వొక్కివోయింది. జనం తండోపతండాలుగా రావటం, ఆయన దర్శనం చేసుకోవటం, విభూతి - రక్షరేకులు తీసుకుంటూ జబ్బులు నయం చేయించుకోవటం తమకు తోచిన తృణమో, పణమో, నగో, వెండో ఆయనకు ఆనందంగా సమర్పించుకోవటం చాలా రోజులుగా జరుగుతూంది. చాలా వరకూ ఆ ఊరి వారంతా ఆయనకు దాసులయిపోయి, ధారాళంగా కానుకలు సమర్పించసాగారు.

ఇదంతా చాలా కాలంకా గమనిస్తున్న వీరయ్య, ఊరి ప్రజలతో, "మీకేమయినా పిచ్చిపట్టిందా, ఆ మాయలమారి స్వాముల వలలో పడ్డారు. అదంతా నాటకం, బూటకం. ఆయనకేం మహిమలూ - పాడూ లేవు. ఆయనేం దేముడు కాదు! అంతా మిమ్మల్ని మోసం చేసి, మీ వద్ద నుంచి ధనం, వస్తువులు ధారాళంగా గుంజి పోగు చేసుకుంటూ బాగుపడుతున్నాడు. అంతే, ఏ రోజో ఈ వూరి నుంచి ఉడాయిస్తాడు - అవన్నీ పట్టుకుని!" అంటూ మొత్తుకుంటూ చెప్పసాగాడు.

అయినా, ప్రజలు వీరయ్య మాటలు లెక్కపెట్టలేదు. వీరయ్య తమ ఊరికి పట్టిన శనిని వదలగొట్టాలని ఆలోచించి ఓ నిర్ణయానికొచ్చాడు.

కొద్ది రోజులు పోనిచ్చి, ఓ ఆరుగురు శిష్యులను పోగుచేసుకుని - ఆ స్వాములవారు ఉండే చెట్టుకి ఎదురుగా ఉన్న చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకుంటూ, మధ్య మధ్య యంత్రాలు వేస్తూ, మంత్రాలు చదవుతూ, ఉచితంగా వైద్యం, మూలికల, తావీదులూ, విభూతీ యిస్తూ, అన్నింటికీ చిరునవ్వే సమాధానంగా నోరు విప్పకుండా జాగ్రత్తపడసాగాడు.

ఉచితం అనే సరికి జనం అటునించి ఇటుకి ఒగ్గీ, భక్తిభావాలు చూపిస్తూ, దండాలు పెడ్తూ దాసోహం అనసాగారు. రోగాలు నయం చేసినా, ఈ కొత్త స్వాములవారు నయాపైసా అయినా పుచ్చుకోక మూలికలు - తావీదులూ - వగైరాలు యివ్వటం, చిరునవ్వే అన్నింటికీ సమాధానంగా చెప్పటం - అందరికీ నచ్చింది,

ఆకర్షించింది. అటు స్వాములవారి ముఖం ముడుచుకుపోయింది - ఇటు వైపుకు చేరిపోయిన జనసమూహాన్ని చూసి!

ఆరోజు - ఏకాదశి. కొత్త స్వాములవారు - కోడిగుడ్డులోంచి బంగారు ఉండరాలనీ, వెండినీ తీసి చూపించాడు. అదే పనిగా కుప్పలు కుప్పలుగా విభూతి రాల్చసాగాడు. తాడుకు చివర ఉంగరం వ్రేలాడదీసి తాడుకు నిప్పంటించినా, అది ఎంతకూ అంటుకోకపోయే సరికి, జనం చప్పట్లు కొట్టేస్తూ, “ఆహా, కోడిగుడ్డులో బంగారం చూపించారు; తాడుని నిప్పు కూడా కాల్చలేకపోతోంది. ఓహో ఏం మహిమా! ఏం మహిమా! నిస్స్వార్థపరులు, మన పాలిట దైవస్వరూపులు; సాక్షాత్ ఆ దైవమే కరుణించి ఈ రూపంలో మన ఊరిలో సాక్షాత్కరించారేమో!” అంటూ పాటలు, భజనలు చేస్తున్న తన్మయత్వంలో ఉన్న ప్రజలను ఉద్దేశించి, “ఆగండి, ఆగండి; శాంతించండి, కంగారుపడకండి, నిదానించి మిగతా సంగతి పూర్తిగా చూసి మరీ ఓ నిర్ణయానికి రండి!” అన్నాడు ఆ కొత్త స్వాములవారు. బిత్తరపోయి, అదిరిపోయి చూడసాగారు శిష్యులతో సహా మరో స్వాములవారు. “ఏమిట్రా!” అని! ప్రజలంతా గప్‌చిప్‌గా ఉన్నారు చేతులు జోడిరచి.

చూడండి, నేను స్వాములవారినీ కాదు, దేవుడ్నీ కాదు. ఇతర సాధువుల్లా నేను మీ అందరికీ “కనువిప్పు” కలిగించి - జ్ఞానోదయం కలిగించాలనే సదుద్దేశంతో మేజిక్ నేర్చుకుని, మీ ముందుంచాను. అదే వీరయ్యగా చూపిస్తే, మీరు నమ్మేవారు కాదు; రాళ్ళు విసిరి కొట్టే వారు. అందుకే - ఆ సాధువులా నేనో సాధువు వేషం ధరించి, మహిమల్లా మేజిక్‌నే చూపించాను. మీరు గుడ్డిగా నన్ను దేవుడ్నిగా మార్చేసి, అసలు నేనెవరో కూడా తెలుసుకోకుండా నాకు పట్టం కట్టి, కొబ్బరికాయలు కొట్టసాగారు. ఇంతకూ ఆ సాధువు చేసిందే నేను చేసాను. తాడుని ఉప్పుద్రావకంలో నానేసి ఎండబెట్టి చివర ఉంగరం కట్టి వ్రేళ్ళాడదీసాను. అది ఎండపోయి కాల్చినా కాలక కర్రలా నిలబడి బేలన్స్‌గా ఉంది. అది మహిమ కాదు మేజిక్! అలాగే కోడి గుడ్డును అయోడిన్‌లో ముంచి ఉంచితే అది ద్రవంగా ముద్దగా అవుతుంది. అప్పుడు దానిలో ఈ బంగారు వెండి సరుకులు కలిపేసి తిరిగి గుండ్రంగా కలిపి ఎండబెట్టితే అది గట్టిగా తిరిగి కోడి గుడ్డులా తయారయి అందులో ఈ వస్తువులు వుంటాయి. ఇది మహిమేం కాదు; అలాగే విభూతి - అల్యూమినియం పాత్రలో, గాఢ గంధకికామ్లము రాసినచో అది రసాయనిక చర్య జరిగి, దానిని రాసిన కొద్దీ విభూధి రాలుతుంది. అంతే తప్ప ఎవరి గొప్పా ఏం లేదు. ఎవరూ దేవుళ్ళు కారు; ఎవరూ సాధువులూ, ఋషులూ కారు; అంతా మానవులే - ఎటొచ్చీ ఒకరిని ఒకరు మోసం చేసుకోటం, ఒకరి పొట్ట జూకరు కొట్టడం తప్ప! నేను మీ మామూలు వీరయ్యని; నన్ను క్షమించండి! మీరు గుర్తుపడతారనే నేను అనుకున్నది సాధించేవరకూ నోరు విప్పలేదు - సాధువు వేషంలో ఉండగా!” అన్నాడు.

అంతా విని ప్రజలు - "మాకు కళ్ళు తెరిపించావు వీరయ్యా - మా అందరికీ నిజంగా 'కనువిప్పు' కలిగించావు. నీ ఋణం తీర్చుకోలేము!" అంటూ అటు చూసే సరికి, ఆ సాధువు శిష్యులతో సహా పారిపోబోయాడు. గబుక్కున ఊరి ప్రజలు వాళ్ళని పట్టుకుని, డబ్బు, వెండి, బంగారు, నగలు సైతం లాక్కుని, "ఒరి దొంగసచ్చినోడా ఎంత పని చేసావ్, మహిమలంటూ మందు పొట్లాలు మాకు యిచ్చి మింగిస్తూ, మా రోగాలు తగ్గంగాన నీ మహిమే అంటూ నాటకాలాడ్తావా?" అంటూ చావబాదారు.